క్లుప్తంగా

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మంగళగిరి: ఇటీవల మృతి చెందిన బాల్య మిత్రుడు కుటుంబాన్ని మిత్రులు ఆదుకున్నారు. బంగారపు పని చేసే రత్నాల చెరువుకు చెందిన గోలి రవికుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో మిత్ర బృందం రవి కుమార్ ఫ్రెండ్ సర్కిల్ పేరుతో రూ. 45ను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, వేణు, అశోక్, ఖాదర్ వలి పాల్గొన్నారు.

50 మందికి కళ్లజోళ్ల పంపిణీ



మంగళగిరి: పట్టణంలోని వడ్లపూడి సెంటర్‌లో గల రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మల వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర పరీక్షలు చేసుకున్న 50 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ముంజపల్లి శివకుమార్ ఆక్యుపంక్చర్ వైద్యంలో అందుబాటులో ఉన్న విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ దీపాల సాంబశివరావు, ప్రానిక్ హీలింగ్ ప్రాక్టీషనర్ శంభునాథ్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా కార్యదర్శి ముంజంపల్లి నాగరాజకుమారి, వృద్ధాశ్రమ నిర్వాహకులు రామనాథం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లి ముగ్గ రోడ్డులో ఏర్పాటు చేసిన భారత మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆదివారం ముగ్గ రోడ్డు యువత ఆవిష్కరించింది. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా నాగేంద్రస్వామి కల్యాణం



మంగళగిరి: నగరంలోని నవులూరు పుట్టతోటలో గల నాగేంద్ర స్వామి, అశ్వర్థ నారాయణ స్వాముల కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. స్వామి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కోలాహలంగా వనసమారాధనలు



మంగళగిరి: వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆదివారం కోలాహలంగా వనసమారాధనలు నిర్వహించారు. పలు మామిడి తోటలు కళకళలాడాయి. పలువురు కుటుంబాలతో హాజరై ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. రోజంతా ఆటపాటలతో, నృత్యాలతో ఆహ్లాదకర వాతావరణంలో గడిపారు. ఆటపాటలు, నృత్యాలలో విజేతలకు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక విందు భోజనాలు నిర్వహించారు.

జీజీహెచ్ అభివృద్ధికి దాతల సాయం వెలకట్టలేనిది

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో సుమారు రూ.86 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) వెనుక దాతల సాయం వెలకట్టలేనిదని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఎంసీహెచ్‌కి సహకరిస్తున్న జింఖానా సభ్యులు డాక్టర్ మొవ్వ వెంకటేశ్వరరావు, మొవ్వ వేదవతిలను ఆయన ఆదివారం శుశ్రుత హాలులో సత్కరించారు. మొదటి అంతస్తుకు మొవ్వ వెంకటేశ్వరరావు రూ.4 కోట్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, జింఖానా సమన్వయకర్తలు డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సేవలు అభినందనీయం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- 457 మందికి రూ. 2కోట్ల విలువైన కృత్రిమ చేతుల పంపిణీ



శిబిరంలో కృత్రిమ చేతుల అమరికను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: సమాజాభివృద్ధిలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. నగరంలోని ఆటోనగర్‌లో గల కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో 457 మందికి రూ.2కోట్ల విలువైన కృత్రిమ చేతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీతో పాటు ముఖ్య అతిథిలు మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో చేతుల కోల్పోయిన వారు జీవనం సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రోటరీ క్లబ్ కృత్రిమ చేతులు పంపిణీ చేయడం శుభ పరిణామమని తెలిపారు. కృత్రిమ చేతులు ఎంతో విలువైనవి కావడంతో పేదలు కొని వినియోగించుకునే పరిస్థితి లేదన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న కృత్రిమ చేతులు బ్యాటరీ అవసరం లేకుండా తేలికగాను, దృఢంగానూ ఉండటంతో చక్కగా ఉపయోగపడతాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక నుంచి వచ్చిన దివ్యాంగులకు బెంగుళూరు, జైపూర్, హైదరాబాద్ నుంచి వచ్చిన టెక్నీషియన్లతో పాటు మంగళగిరికి చెందిన 15 మంది ఫిజియోథెరపిస్టులు చేతుల్ని అమర్చి, వాటిని వినియోగించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన ఎల్ఎస్ మెడ్యూస్ ప్రోస్థెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ గ్లోబల్ అంబాసిడర్ కె.వి. మోహన్‌కుమార్, రోటరీ ఇంటర్నేషనల్ 3150 గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి, ప్రెసిడెంట్ అందే రేవంత్, సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు, ప్రతినిధులు అందే మురళీమోహన్, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, నిరంజన్ గుప్తా, ప్రగడ రాజశేఖర్, కొతారపు వేణుగోపాల్, సుందరయ్య, బట్టు వెంకటేశ్వరరావు, రావెల శ్రీనివాసరావు, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్లు జాస్తి రంగారావు, అన్నే రత్నప్రభాకర్, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక జ్ఞానం అవసరం



గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేస్తున్న సింగయ్య

ఫిరంగిపురం: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సింగయ్య తెలిపారు. మండలంలోని నుదురుపాడులో పీస్ ఆఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బైబిల్ క్విజ్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ పొరుగువానిని ప్రేమించాలని చెప్పారు. అంతేకాకుండా తనకున్న దానిలో సహాయం అందించాలని, దానివల్ల ఎంతో ఆత్మానందం చేకూరుతుందని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వేములూరిపాడుకు చెందిన విజయరాణికి రూ.8వేలు అందించారు. ద్వితీయ స్థానాన్ని చిలుకలూరిపేటకు చెందిన జోషి గ్రూపు, ములకలూరుకు చెందిన శిరీష గ్రూపు మూడో స్థానాన్ని పొందారు. వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ పి.దాసు, టి.వీరయ్య, ప్రసాద్, డి.వెంకట్, డేనియల్, వేణు, జ్యోతిమాణిక్యరావు, ఉప్పలపాటి శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, విద్యాసాగర్, విజయభాస్కర్, జి.రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: పట్టణంలోని భార్గవపేటలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు... చింత క్రింది కనకయ్య ఉన్నత పాఠశాలలో గోరు నాగవెంకటకృష్ణ 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల్ని విచారించినా ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి విశ్వేశ్వర రావు ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోవిడ్ ఫైటర్ షేక్ అజ్మతుల్లా కుటుంబానికి ఆర్థిక సాయం



గుంటూరు ఎడ్యుకేషన్: కరోనా మహమ్మారి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో కన్నవారే దగ్గరకు రాని విపత్కర పరిస్థితుల్లో కులమతాలకు అతీతంగా మృతులకు దహన సంస్కారాలు నిర్వహించిన కోవిడ్ ఫైటర్స్ టీం సభ్యుల్లో ఒకరైన షేక్ అజ్మతుల్లా మరణం దిగ్భ్రాంతికి లోను చేసిందని బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ అసోసియేషన్, బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం కోవిడ్ ఫైటర్ అజ్మతుల్లా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.76 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రాల శివశంకర్, సభ్యులు ఐ.కె.వి.ప్రసాద్, మిలటరీ యూసఫ్, సత్తార్, జిలానీ, మన్సూర్, ముస్తఫా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మంగళగిరి: నియోజకవర్గంలో వర్గాలు లేవని అందరం వైఎస్సార్ సీపీ వర్గమేనని మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి స్పష్టం చేశారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా సమష్టిగా, కష్టపడి పని చేసి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ ఎంతో బలంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, గోరెబాబు, బొమ్ము శివరామిరెడ్డి పాల్గొన్నారు.

చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అమర్

గుంటూరు మెడికల్: చర్మవ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా, జీవన విధానం, పనితీరుపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు డి. అమర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో ఆదివారం ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరంలో డాక్టర్ అమర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ సారథ్యం వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితుల్లో బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ముఖ్యంగా శరీరంలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలైన చంకలు, గజ్జలు, ప్రత్యుత్పత్తి అవయవాలు, కాలి వేళ్ల మధ్యలో చర్మవ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. అన్ని రకాల చర్మ వ్యాధులకు ఆయింట్మెంట్లు మాత్రమే పని చేయవని వెల్లడించారు. స్టెరాయిడ్స్ ఉన్న ఆయింట్మెంట్లను వైద్యుని సలహా లేకుండా అసలు వాడకూడదని సూచించారు. ఏ మందు ఏ చర్మ వ్యాధికి సమర్థంగా పనిచేస్తుందో వైద్యుల ద్వారా తెలుసుకుని వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ప్రజలు చర్మవ్యాధులకు అంతగా ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, వీటి ప్రభావం జీవన సరళిపై పడుతుందని తెలిపారు. డాక్టర్ టి. సేవ కుమార్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం ఒక స్పెషలిస్ట్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు టి.ఉమామహేశ్వరరావు, చావ శివాజీ పాల్గొన్నారు.

పొన్నూరులో బంద్ ప్రశాంతం



పొన్నూరు: పట్టణంలో అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎం. శ్రీనివాసరావు అనే వ్యక్తి అవమానకరంగా ప్రవర్తించిన ఘటనకు నిరసనగా దళిత సంఘాలు ఆదివారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. పలువురు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ముందస్తుగా దళిత సంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. ఈ ఘటనపై యువతను రెచ్చగొట్టే విధంగా చేసే కార్యకలాపాలు సాగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 400 మంది పోలీసులు పట్టణ వ్యాప్తంగా మోహరించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

సందడిగా 'బాలకుటీర్'లో లలిత కళా ఉత్సవం



సురేష్, భాగ్యలక్ష్మిని మంగాదేవి బాలసాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న మంగాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ 26వ లలిత కళా ఉత్సవాన్ని ఆదివారం సాయంత్రం మల్లారెడ్డినగర్‌లోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాదకరమైన విద్యను అందించి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఉన్నత రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఏఎన్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వి. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విద్యతో పాటు విలువలకు ప్రాధాన్యమిస్తున్న బాలకుటీర్ విద్యావ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ పూర్వపు కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు యేటా లలిత కళా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. పురస్కార గ్రహీతల్లో ఒకరైన మంచి పుస్తకం ప్రచురణ సంస్థ నిర్వాహకులు కె. సురేష్, పి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించి, మాతృభాషలో మాట్లాడే విధంగా మంచి పుస్తకం తరపున కృషి చేస్తున్నామని వివరించారు. మరొక పురస్కార గ్రహీత దేవనపల్లి వీణావాణి మాట్లాడుతూ వ్యక్తి వ్యవస్థగా మారే సంఘటన, సందర్భం తప్పక ఉంటాయని వివరించారు.

పురస్కారాల ప్రదానం

లలిత కళా ఉత్సవంలో భాగంగా మంచి పుస్తకం ప్రచురణకర్తలైన కొనరాజు సురేష్, పోతరాజు భాగ్యలక్ష్మికి ''మంగాదేవి బాల సాహిత్య'' పురస్కారం, తెలంగాణాకు చెందిన రచయిత్రి, అటవీశాఖ సహాయ కన్జర్వేటర్ దేవనపల్లి వీణావాణికి ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ ప్రియ స్మృతిలో నెలకొల్పబడిన మాలతీ సాహితీ ప్రమదా పురస్కారం, నాలుగేళ్ల వయసులోనే సంగీత ప్రయాణాన్ని ప్రారంభించిన పోలవరపు సాధ్యను ప్రతిభా పల్లవ పురస్కారంతో సత్కరించి, నగదు బహుమతులను అందజేశారు. తెలుగు గిజుభాయ్, బాలల ప్రేమికుడు సీఏ ప్రసాద్‌కు ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం లలిత కళల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఉదయం జరిగిన లలిత కళా సంగీతోత్సవ ప్రారంభ సభకు ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు రావెల సాంబశివరావు, బాలకుటీర్ సహ కార్యదర్శి జయశ్రీ, సీఏవో వి.రఘురాం, చేతన ప్రతినిధి మరుద్వతి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే పరమావధి



నెహ్రూనగర్: వ్యాపారాలు విస్తరించి లాభాలు గడించాలంటే నిజాయతీ, నాణ్యతతో కూడిన ఉత్తమ సేవలు అందించడం ఒకటే మార్గమని క్రేన్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు పేర్కొన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే పరమావధి కావాలని సూచించారు. ఆదివారం కొత్తపేట చిన్న మహాలక్ష్మమ్మ దేవాలయం దగ్గర ముప్పిరిశెట్టి వారి వీధిలో రామ్ రాజ్ కాటన్ వారి నూతన ఉత్పత్తుల జిల్లా డిస్ట్రిబ్యూటర్ మీనాక్షి ట్రేడర్స్‌ను స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమతతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్లు కోట నితీష్, అద్దెపల్లి రాము మాట్లాడుతూ దేశంలోనే నాణ్యమైన ఉత్పత్తులకు మారుపేరుగా ఉన్న రామరాజ్ కాటన్ దోతీస్, షర్ట్స్, బనియన్స్ జిల్లా డిస్ట్రిబ్యూటర్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు.

జీవకోటి మనుగడకు నేల, నీరు ఎంతో అవసరం



వ్యవసాయంపై రచనలు చేసిన విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రత్నప్రసాద్

మంగళగిరి: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వ్యవసాయ విభాగం డైరెక్టర్ డాక్టర్ పి. రత్నప్రసాద్ మాట్లాడుతూ మానవ మనుగడతో పాటు జీవకోటికి నేల, నీరు ఎంతో అవసరమని తెలిపారు. రెండు లేకుండా భూమి మీద జీవరాసులు మనుగడ సాగించడం అసాధ్యమని చెప్పారు. ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని ప్లాస్టిక్ వ్యర్థాలతో సారవంతమైన నేల కూడా కలుషితమవుతుందన్నారు. నీరుకు, మట్టికి విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. మనిషికి అవసరమైన ఆహారం తయారు చేయాలంటే, మట్టికి నీటిని అందించినప్పుడు మాత్రమే మొక్కలకు జీవం అందుతుందన్నారు. ఆధునిక యుగంలో ఆహార కొరత లేకుండా అందరికీ అందించే బాధ్యత వ్యవసాయ విభాగ విద్యార్థులపై ఉందని తెలిపారు. వ్యవసాయాన్ని దండగ అనే విధంగా కాకుండా రైతులకు లాభసాటిగా మార్చే విధంగా, ఆధునిక వ్యవసాయంలో మార్పులు అవసరమని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయంపై రచనలు చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి. బాలకృష్ణ, ప్రొఫెసర్ ప్రభావతి, వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, లైఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విలియమ్స్

ఫిరంగిపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన అవసరమని ఇంచార్జి ఎంపీడీవో విలియమ్స్ తెలిపారు. మండలంలోని కండ్రిక, 113 తాళ్లూరు గ్రామాల్లో ఆదివారం వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంపీడీవో విలియమ్స్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి మాతృత్వ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జలజీవన్ మిషన్ పథకాల వల్ల ప్రజలకు చేకూరిన ప్రయోజనాల్ని వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శులు జి.వి.ఆర్.కె.మూర్తి, సత్యానంద్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, నారాయణ, హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత, జ్ఞాన సంపద పెంపొందించుకోవాలి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత, జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని విచారణ గురువులు పి.బాలస్వామి ఉద్బోధించారు. స్థానిక బాల ఏసు దేవాలయంలో క్రీస్తు జయంతి మహోత్సవ ప్రారంభ సూచికగా ఆదివారం జెండా ప్రతిష్ట, దివ్య పూజాబలి నిర్వహించారు. బాలస్వామి మాట్లాడుతూ మానవాళిని రక్షించేందుకు ఏసుక్రీస్తు మానవుడి రూపం ధరించాడని తెలిపారు. లయోలా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి.సురేష్ మాట్లాడుతూ నిత్య జీవితంలో కష్టాలు సాధారణమని, వాటిని అధిగమించాలంటే భగవంతుడి ఎడల భక్తిభావంతో ఉండాలని సూచించారు. మానవుల కష్టాలు తొలగించేందుకు ఏసు తన దివ్య మహిమలు చూపాడని చెప్పారు. అనంతరం దేవాలయం వద్ద జెండా ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ఆర్. అనిల్ కుమార్, డేకాస్ టి.మోజెస్, మఠకన్య స్త్రీలు, సొడాలిటీ సభ్యులు, కథోలిక సంఘం, గుడి పెద్దలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ స్వరూపవాణి

మంగళగిరి: నియోజకవర్గంలోని దుగ్గిరాల పాస్టర్స్ ఫెలోషిప్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గానూ స్థలం కోసం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ. 1లక్ష ఆర్థిక సాయం చేశారు. ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సంఘాల పాస్టర్లకు నగదును ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అందజేశారు. ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే ఆర్కేకు డీపీఎఫ్ సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న నూరి ఫాతిమా, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: ఉచిత వైద్య శిబిరాల్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా సూచించారు. పొన్నూరు రోడ్డు హుస్సేన్ నగర్‌లో యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యసేవల్ని అందిస్తున్న హోప్ విన్ హాస్పిటల్స్‌కు అభినందనలు తెలిపారు. హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు, నగరంలోని మురికివాడల్లో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు, మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నామని చెప్పారు. సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రిజ్వానా, హాస్పిటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకం ఓ మంచి స్నేహితుడితో సమానం

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు
- విశాలాంధ్ర పుస్తక మహోత్సవం ప్రారంభం



బుక్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

పాత గుంటూరు: పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని, చదవడం వల్ల ఎన్నో విషయాలు అవగతం అవుతాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో గుంటూరు ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆయన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువగా దగ్గరవుతున్న నేపథ్యంలో పుస్తకాల పఠనం తగ్గిందని తెలిపారు. కానీ పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. పిల్లలు పుస్తకాల పఠనం వైపు మరలేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఆయన సూచించారు. పుస్తకాలను ప్రజలకు చేరువ చేసేలా గత 23 ఏళ్లుగా బుక్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్న విశాలాంధ్రకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన సమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి టి. మనోహర్‌నాయుడు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొన్నారు.